- పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీరు
- పూర్తిగా దెబ్బతిన్న పత్తి
- నష్టాలు మూటగట్టుకుంటున్న రైతన్నలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

అధిక వర్షాలు.. అన్నదాతకు నష్టాలు


నందవరంలో మిరప పంటలో నిలిచిన వాన నీరు


నాగలదిన్నెలో పత్తి పంటలో వాన నీరు నిలిచిన దృశ్యం

నందవరం : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రైతులు నష్టాల పాలవుతున్నారు. శ్రమించి పంట పండిస్తే గిట్టుబాటు ధరలు లేవులు. ఉల్లి, టమాటకు ధరలు లేక పతనమయ్యారు. ప్రస్తుతం అధిక వర్షాలతో పత్తి పంట తీవ్రంగా దెబ్బతినండతో పెట్టుబడులు కూడా దక్కడం లేదు. దీనికి తోడు రైతన్నకు అల్పపీడనం కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. అధిక వర్షాలతో పంట పొలాల్లో నీరు నిలిచి నష్టాలు మూటగట్టుకుంటున్నారు. ఎడతేరిపి లేని వానలకు పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కనీసం పెట్టుబడులకు కూడా చేతి వచ్చే పరిస్థితి లేదని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

38 వేల ఎకరాల్లో పత్తి సాగు

నందవరం మండలంలో 51 వేల ఎకరాలలో పంటలు సాగయ్యాయి. అందులో 38 వేల ఎకరాల్లో పత్తి పంట పాగు చేశారు. అధిక వర్షాలతో పత్తి నేల రాలిపోయి, కాయాలు కుళ్లిపోయాయి. పూత సైతం రాలిపోయింది. మొత్తానికి పంట తీవ్రంగా దెబ్బతింది. దిగుబడులు రాక రైతన్నలు నష్టాలు మూటకట్టుకుంటున్నారు. అలాగే ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఉల్లి కొనుగోలు చేయకపోవడంతో ఉల్లికి గిట్టుబాటు ధర లేకపోవడంతో ఉల్లి రైతులు పొలంలోనే వదిలేశారు. మిరప పంటలో వాన నీరు నిలిచి మొక్క వాడిపోతుంది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పత్తి పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

పత్తికి ధర తగ్గింది



అధిక వర్షాలకు పత్తి తడిగా ఉందని దళారులు ధర తగ్గించారు. పత్తి తడిగా ఉందనే సాకుతో రూ.4 వేల నుంచి రూ.5,500 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఇలాగైతే కనీసం పెట్టుబడులు కూడా చేతికి రావు. పత్తికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి సీసీఐ కొనుగోలు చేసే విధంగా ఏర్పాటు చేయాలి. అధిక వానలకు తీవ్రంగా నష్టాలు మూటగట్టుకున్నాం.

– నరసింహారెడ్డి, పత్తి రైతు, జోహరాపురం

ప్రభుత్వం పంట నష్ట పరిహారం అందించాలి



అధిక వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. అధిక వానలతో పత్తి పూర్తిగా దెబ్బతింది. చేతికి అందివచ్చిన పత్తి వానలకు నేల రాలిపోవడం, కాయాలు కుళ్లిపోవడంతో పాటు మొక్కలు గిడుసుబారిపోయాయి. దిగుబడులు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పత్తి రైతులకు ప్రభుత్వం పంట నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– పంపన్నగౌడ్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

పరామర్శ


చిన్నమల్లారెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: హైదరాబాద్‌లోని ఏఐజీ అస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న కడిమెట్ల గ్రామానికి చెందిన తన సోదరుడు చిన్నమల్లారెడ్డితో పాటు పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి టీస్టాల్‌చంద్రను మంగళవారం మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని వైద్యులతో మాట్లాడారు. ఎర్రకోట పవన్‌కళ్యాణ్‌రెడ్డి, చెన్నారెడ్డి, బాలరెడ్డి, కందనాతి వేణుగోపాల్‌రెడ్డి, నాగభూషన్‌రెడ్డి ఉన్నారు.

కాటికాపరులను ఆదుకోవాలి

కోసిగి: శ్మశానంలో గుంతులు తీసి జీవనం సాగించే కాటికాపరులను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించి ఆదుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. మంగళవారం కోసిగిలో కాటికాపరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోసిగి మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా ఆవుల నరసయ్య, ప్రధాన కార్యదర్శి రామకోటి ఫిలిప్, మరో 19 మందిని కమిటీ సభ్యులుగా ఎనుకున్నారు.

క్లుప్తంగా

సౌత్ జోన్ పోటీలకు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

ఆదోని సెంట్రల్: సౌత్ జోన్ క్రీడా పోటీలకు బండారి అఖిల్ ఎంపికైనట్లు జ్యోతిర్మయి విద్యాసంస్థల అధినేత మురళీబాబు మంగళవారం తెలిపారు. వారు మాట్లాడుతూ జ్యోతిర్మయి డిగ్రీ కళాశాలలో డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్న అఖిల్ 28వ తేదీ ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన రాయలసీమ యూనివర్సిటీ కబడ్డీ టోర్నమెంట్‌లో ప్రతిభను కనపరి సౌత్ జోన్‌కు ఎంపికయ్యాడన్నారు. ఇతను అక్టోబర్ 4 నుంచి 7వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలోని రాణి చెన్నమ్మ యునివర్సిటీ బెళగావిలో జరిగే సౌత్ జోన్ పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయులు సురేంద్ర, రూప కళాశాల ప్రిన్సిపాల్ డా. స్వామినాథ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న లక్ష్మిరెడ్డి

కౌతాళం: మండల పరిధిలోని బదినేహాల్ గ్రామంలో దసరా పండుగను పురస్కరించుకుని గ్రామపెద్ద వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు లక్ష్మిరెడ్డి పంచాయతీ కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగే ఈ సంవత్సరం కూడా పంచాయతీ కార్మికులకు తన వంతు సహాయంగా నూతన వస్త్రాలు అందజేసినట్లు తెలిపారు.

జీడీపీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల


ప్రాజెక్ట్ నుంచి విడుదలవుతున్న నీరు

గోనెగండ్ల : గాజులదిన్నె ప్రాజెక్ట్‌కు వరద నీరు వచ్చి చేరుతుండడంతో సోమవారం ఉదయం నాలుగవ గేటు ఎత్తి 2వేల క్యూసెక్కుల నీటిని జీడీపీ అధికారులు హంద్రీనదికి విడుదల చేశారు. మంగళవారం మధ్యాహ్నం వరకు 1600 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగింది. మధ్యాహ్నం జీడీపీలోకి వరద నీటి ప్రవాహం తగ్గిపోవడంతో నీటి విడుదలను తగ్గించి 330 క్యూసెక్కులను మాత్రమే హంద్రీనదికి విడుదల కొనసాగిస్తున్నారు. జీడీపీలో ప్రస్తుతం 3.9 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టు సామర్థ్యం 4.5 టీఎంసీలు. జీడీపీ ఎగువ ప్రాంతంలో వర్షాలు కురిసి వరద వచ్చి జీడీపీలో చేరితే నీటి విడుదలను కొనసాగిస్తామని ఏఈ మహమ్మద్ అలీ తెలిపారు.

పుస్తకాల ఆవిష్కరణ


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: పట్టణంలోని బంగారు బజారులో శ్రీ మహాకాళికాదేవి ఆలయంలో తోవి శంకరప్ప చారి రచించిన రెండు పుస్తకాలను మంగళవారం ఆవిష్కరించారు. మహానీయుల చరిత్ర, ఆధ్యాత్మిక ప్రబోధలు పుస్తకాన్ని విశ్వబ్రాహ్మణ సంఘం చైర్మన్ అయ్యన్న ఆచారి ఆవిష్కరించారు. అలాగే గాయత్రీదేవి వేదాంతం విజ్ఞానం మరియు తత్వము అనే కన్నడ పుస్తకాన్ని శివరుద్ర ఆచారి ఆవిష్కరించారు. మునిస్వామి, సిద్ధరామయ్య, ఆలయ పూజారులు పాల్గొన్నారు.

అలసందగుత్తిలో చిరుత కలకలం

ఆదోని సెంట్రల్: మండలంలోని అలసందగుత్తిలో చిరుత కనిపించినట్లు మంగళవారం ఉదయం కలకలం రేగింది. ఉదయం పొలం పనులకు వెళ్తుండగా చిరుతను చూసినట్లు గ్రామస్తులు తెలిపారు. కుక్కపై దాడి చేసి గాయపరిచినట్లు చర్చించుకుంటున్నారు. పొలాల వద్ద చిరుత సంచరిస్తున్నట్లు తెలియడంతో గ్రామ ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. రాత్రిపూట బయటకు వెళ్లాంటేనే భయం భయంగా ఉందని వాపోతున్నారు. పొలాల పనుల నిమిత్తం పిల్లలు, పెద్దలు తిరుగుతూ ఉంటారు కనుక అటవీ శాఖ అధికారులు స్పందించి చిరుతను బంధించాలని కోరుతున్నారు.

ఆందోళన వద్దు

మండలం అలసందగుత్తిలో చిరుత సంచారంపై కలకలం రేగిన విషయం తెలుసుకున్న ఫారెస్ట్ రేంజ్ అధికారి తేజశ్విని స్పందించి ఎఫ్‌బీఓలు రామ్‌మోహన్, సమీవుల్లాను గ్రామానికి పంపించారు. ప్రజల్లో ఎలాంటి అందోళనలు కలగకుండా వారికి చిరుత పులుల సంచారం.. తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించారు. కొండ ప్రాంతాల్లో గొర్రెలను, మేకలను మేపడానికి వెళ్లరాదని, ఉదయం, సాయంత్రం వెళల్లో ఇంట్లోనే ఉండాలని సూచించారు. పిల్లలను ఒంటరిగా తిరగనియవద్దు చెప్పారు.

మంత్రాలయం మీదుగా కోసిగికి బస్సు

సాక్షి ఎఫెక్ట్


కోసిగి బస్టాండులో ఎమ్మిగనూరు బస్సు

కోసిగి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎమ్మిగనూరు నుంచి కోసిగి మీదుగా ఉరుకుంద బస్సు సౌకర్యం మూడు రోజులు క్రితం రద్దయిన విషయం విదితమే. మాలపల్లి- కంబళదిన్నె గ్రామాల మధ్య రోడ్డు కోతకు గురికావడం, వాగులు అడ్డుపడడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. గత మూడు రోజులుగా ప్రయాణికులు ఆటోలలోను , ఆదోని మీదుగా చుట్టూ తిరిగి వెళ్లుతూ తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయంపై మంగళవారం 'సాక్షి' దినపత్రికలో 'రాకపోకలు బంద్' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎమ్మిగనూరు డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడు ప్రత్యామ్నాయంగా ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోసిగి మీదుగా ఉరుకుంద వరకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు.

దళితుల హక్కుల కోసం పోరాటం చేద్దాం


మాట్లాడుతున్న చిన్నమారయ్య

కౌతాళం: దళితుల హక్కుల కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్న మారయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య అన్నారు. కెవిపీఎస్ జనరల్‌బాడీ సమావేశం మండల కార్యదర్శి వీరేష్ అధ్యక్షన జరిగింది. వారు మాట్లాడుతూ మండలంలో దళితులు అధిక సంఖ్యలో ఉన్నారని.. ఎన్నికల సందర్భంగా దళితులు గుర్తుకొస్తున్నారే తప్ప, ఎన్నికల తర్వాత దళితులు ఎవరో అని ప్రశ్నించే స్థాయిలో నాయకులు ఉన్నారని విమర్శంచారు. మండలంలో డప్పు కళాకారులు, చర్మకారులు, గుంతలు తీసే బేగారి కార్మికులు అందరూ అనేక కష్టాల్లో ఉన్నారని వీరికి ప్రభుత్వం ఆదుకోవడంలో విఫలం అయ్యిందన్నారు. ఈనెల 2 నుంచి 10వ తేదీ వరకు కెవిపీఎస్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని అన్ని గ్రామాల్లో జెండా ఆవిష్కరణ చేయాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో తాయప్ప, వీరేష్, ఆదాం, హనుమంతు, ఈరన్న పలువురు పాల్గొన్నారు.


గవ్వల అలంకారంలో మహాయోగి లక్ష్మమ్మవ్వ


పెద్దకడబూరులో మహిషాసురమర్దినిగా


కౌతాళంలో చాదేశ్వరిదేవి


కందుకూరులో దుర్గా దేవిగా శాంభవి దేవి

జయ జయహే... మహిషాసురమర్దిని


పల్లకోత్సవంలో అమ్మవారు


రాక్షసుల వేషధారణలో కళాకారులు


మహిషాసురమర్దినిగా ఫారెస్ట్‌లైన్ అంబాభవాని

ఆదోని అర్బన్: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అమ్మవారిని ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా మహిషాసురమర్దిగా అలంకరించారు. దుర్గామాత, బర్రె, రాక్షసుల వేషధారణలతో భక్తులు అలరించారు. స్థానిక నగరేశ్వర స్వామి ఆలయం నుంచి బంగారు బజారు, హవన్నపేట, బసవన్నగుడి మీదుగా ఆలయానికి చేరుకున్నారు. అలాగే పట్టణంలో శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

కౌతాళం: కౌతాళంలో వెలసిన చౌడేశ్వర దేవి అమ్మవారి ఆలయంలో, అలాగే ఉప్పరహల్ గ్రామంలో వెలసిన అమ్మవారిని, కామవరంలో వెలసిన అమ్మవారిని అలంకరించారు. కౌతాళంలోని వాసవి మాత ఆలయంలో వివిధ పండ్లతో అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు.

కోసిగి: మండలంలోని కందుకూరు గ్రామంలో వెలసిన శాంభవి దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గాష్టమిని పురస్కరించుకుని దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

మంత్రాలయం రూరల్ : మండల కేంద్రంలోని వాసవి కల్యాణ మంటపంలో కొలువైన వాసవి మాత మంగళవారం దుర్గాదేవిగా దర్శనమిచ్చారు.

పెద్దకడబూరు : మండల కేంద్రంలో వెలసిన చౌడేశ్వరిదేవి అమ్మవారు, కాళికాదేవి అమ్మవారు, మండల పరిధిలోని దొడ్డిమేకలలో వెలసిన పార్వతీదేవి అమ్మవారు మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు కనువిందు చేశారు.

నందవరం : మండల కేంద్రంలోని బంగారమ్మ దేవి, సోమలగూడూరు గ్రామంలో పెద్దమ్మను దుర్గాదేవిగా అలంకరించారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంతో పాటు వీవర్స్‌కాలనీ మైదానంలో వివేకానంద సంస్థ ఏర్పాటు చేసిన మండపంతో పాటు పలు ఆలయాల్లో దుర్గాదేవి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కలుగోట్ల గ్రామంలో దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా మంగళవారం శ్రీ దుర్గాదేవి దేవాలయంలో అమ్మవారు శ్రీ దుర్గాదేవిగా దర్శనమిచ్చారు.


సోమలగూడూరులో దుర్గాదేవి అలంకరణలో పెద్దమ్మ దేవి


ఎమ్మిగనూరులో దుర్గాదేవిగా కన్యకాపరమేశ్వరి


కలుగోట్లలో ..

పింఛన్లు పకడ్బందీగా పంపిణీ చేయాలి

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో అక్టోబర్ 1వ తేదీ నుంచి పింఛన్లను పకడ్బందీగా పంపిణీ చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ ఆదేశించారు. మంగళవారం ఆయన తన ఛాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. గ్రామ, వార్డు సచివాలయాల జేసీ ఆదేశాల మేరకు బుధవారం నుంచి సచివాలయాల్లోనే పింఛన్లను పంపిణీ చేస్తున్నారని, ఈ విషయాన్ని పింఛన్‌దారులు గమనించాలన్నారు. ఆదోని మున్సిపాలిటీలో 16,728 మందికి గానూ రూ.7.20 కోట్లు నగదును పంపిణీ చేయనున్నామన్నారు.

వర్షాలకు నష్టపోయిన ప్రజలను ఆదుకోవాలి

ఆదోని రూరల్: పట్టణంలో గత వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు సర్వం కోల్పోయిన బాధిత ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్‌దేశాయ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశులు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని డీఎస్పీ బంగ్లా రోడ్డులో భారీ వర్షాలకు నష్టపోయిన పేద కుటుంబాలను పరామర్శించారు. కూలి పనులు చేస్తే తప్పా పూట గడవని పేద కుటుంబాలు ఉన్న కొద్దిపాటి తిండి గింజలు కూడా భారీ వర్షానికి ఇళ్లల్లోకి నీరు చేరి నష్టపోయారన్నారు. సబ్‌కలెక్టర్, సంబంధిత అధికారులు స్పందించి పేద కుటుంబాల వారికి ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులను అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, నాయకులు గోపాల్, శ్రీనివాసులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి


మాట్లాడుతున్న ప్రజా ఆత్మగౌరవ వేదిక గౌరవాధ్యక్షుడు డాక్టర్ నల్లారెడ్డి

ఆదోని సెంట్రల్: కళాశాల విద్యార్థుల ఫీజురీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రజా ఆత్మగౌరవ వేదిక గౌరవ అధ్యక్షుడు డాక్టర్ నల్లారెడ్డి, అధ్యక్షులు భీమరెడ్డి డిమాండ్‌చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల కానందు వలన కళాశాలలను నడుపుకొనలేక, అధ్యాపకులకు జీతాలు ఇవ్వలేక పోతున్నామని, అందుకే కళాశాలలను బంద్‌కు పిలుపు నిచ్చినట్లు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం తెలియజేసిందని చెప్పారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యానికి ఆంధ్రప్రదేశ్ ప్రజా ఆత్మగౌరవ వేదిక సభ్యులు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు.

చేనేత పార్క్ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గంలోని చేనేతల కోసం టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సుందరయ్యభవన్‌లో ఏర్పాటు చేసిన సీపీఎం ప్రాంతీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానికంగా చేనేత కార్మికులకు ఉపాధినిచ్చే వాటిని ఏర్పాటు చేయాలని కోరారు. చేనేత పార్క్‌కు విధివిధానాలు రూపొందించి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గోవిందు, నాయకులు హనుమంతు, రాముడు, లక్ష్మీనర్సయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆయుధం డిజిటల్ బుక్


క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దకడబూరు : రాష్ట్రంలో అన్యాయం జరిగిన ప్రతి ఒక్కరికి ఆయుధంలా ఉపయోగపడేదే డిజిటల్ బుక్ అని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీపీ శ్రీవిద్య ఇంటి ఆవరణలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు అండగా ఉండడానికే పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ను తీసుకొచ్చారన్నారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు కూటమి నాయకుల నుంచి కానీ, పోలీస్‌లు, అధికారుల నుంచి దాడులు జరిగినా, అన్యాయం, నష్టం జరిగినా, అక్రమాలకు పాల్పడినా డిజిటల్ బుక్‌లో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి శివరామిరెడ్డి, ప్రచార విభాగం తాలూకా అధ్యక్షుడు ముక్కరన్న, వాణిజ్య విభాగం మండల అధ్యక్షుడు బ్రహ్మయ్య అచారి, విద్యార్థి విభాగం తాలూకా అధ్యక్షుడు దయ్యాల మహబూబ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అర్లప్ప, బీసీ సెల్ మండల అధ్యక్షుడు శాంతమూర్తి, నాయకులు దస్తగిరి, రాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనుల పోస్టర్లను చూపుతున్న ఎంపీపీ గొల్ల కేశన్న, సర్పంచ్

ఎమ్మిగనూరురూరల్: ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మల్కాపురం సర్పంచ్ దేవేంద్రగౌడ్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ఎంపీపీ గొల్ల కేశన్న, వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జాలవాడి లక్ష్మన్న డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో మల్కాపురం సర్పంచ్ దేవేంద్రగౌడ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే మాదిరిగానే సర్పంచ్ కూడా ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధి అన్నారు. సోమవారం మల్కాపురం గ్రామంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్ కార్యక్రమంలో పాల్గొన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి..సర్పంచ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే హోదాలో ఉండి ఇలాంటి మాటలు మాట్లాడటం ఎంత వరకు న్యాయమన్నారు.

గ్రామంలో జరిగిన అభివృద్ధిని చూసి మాట్లాడాలి

ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి గ్రామంలో జరిగిన అభివృద్ధిని చూసి మాట్లాడాలని మల్కాపురం సర్పంచ్ దేవేంద్రగౌడ్ తెలిపారు. మాకు నోరుందని, మేము మాట్లాడగలమని కానీ, మా నాయకుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విలువలతో కూడిన రాజకీయం నేర్పించాడన్నారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.కోట్లు వెచ్చించి చేపట్టిన నాడు నేడు కింద స్కూల్స్ పనులు, సచివాలయం, ఆర్బీకే, హెల్త్ క్లినిక్ సెంటర్, రోడ్డు నిర్మాణాలు మీకు కనిపించ లేదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే సర్పంచ్‌లను చులకనగా మాట్లాడటం మానుకోవాలని తెలిపారు. సమాశంలో సర్పంచులు రంగస్వామి, వెంకట్రామిరెడ్డి, నాయకులు లోకన్న, మల్లికార్జున, అబ్రహాం, హనుమంతు, బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలి


నిరసన తెలియజేస్తున్న మత్స్యకారులు


గోనెగండ్ల : గాజులదిన్నె ప్రాజెక్టు మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ సంఘం అధ్యక్షుడు రంగస్వామి, ప్రధాన కార్యదర్శి మునిస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం మత్స్యకారులు గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద నిరసన తెలియజేసి జీడీపీ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ గత 18 రోజులుగా ఇరిగేషన్ అధికారులు గాజులదిన్నె ప్రాజెక్టు గేట్లు ఎత్తి హంద్రీనదికు నీటిని విడుదల చేయడంతో ప్రాజెక్టులో ఉన్న చేపలన్నీ దిగువకు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లుగా పెంచుకున్న చేపలు పట్టలేక పోతున్నామని.. దీంతో నష్టం వచ్చిందని వాపోయారు. గాజులదిన్నె ప్రాజెక్టు మత్స్యసంఘం నుంచి ప్రభుత్వానికి ప్రతి ఏడాది రూ.12లక్షలు రుసుము చెల్లిస్తున్నామని తెలిపారు. అలాగే రూ.20లక్షలు ఖర్చుచేసి 40 లక్షల చేపల గుడ్లను ప్రాజెక్టులో పెంచామని, అవి చేతికి అందేలోపు నీటిని విడుదల చేయడంతో చేపలన్నీ దిగువకు పోతున్నాయన్నారు. మత్స్యసంఘంలో 337 కుటుంబాలు ఉన్నాయని ప్రతి కుటుంబానికి నష్ట పరిహారం అందజేసి, ఏడాది రుసుము రూ.12లక్షలను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.


జలమయమైన విద్యుత్ సబ్ స్టేషన్



జలగండం

మంత్రాలయం : మంత్రాలయం పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాఘవేంద్రపురంలోని లోతట్టు ప్రాంతాలు వానొస్తే జలమయమవుతున్నాయి. ముఖ్యంగా విద్యుత్‌సబ్ స్టేషన్ వర్షపు నీటితో నిండిపోతుంది. కారణంగా అక్కడ పనిచేస్తున్న ఆపరేటర్లు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఫీడర్ల ఆపరేటింగ్ చేయాల్సి వస్తోంది. ఇక ఆర్టీసీ బస్టాండ్‌లో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో బస్టాండ్ ప్లాట్‌ఫాం నిండా వాననీరుతో చేరుతోంది. వాన కురిసినా రెండు రోజులైనా అక్కడ నీరు మాత్రం అలాగే ఉండిపోతోంది. ఇక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలోనూ ఇదే పరిస్థితి. వానొస్తే అక్కడ విద్యార్థులు ఆటపాటలకు స్వస్తి చెప్పాల్సిందే. రాఘవేంద్రపురంలో సీసీరోడ్లు ఉన్నా సరైనా డ్రైనేజీ వ్యవస్థ లేని కారణంగా వాననీరు లోతట్టు ప్రాంతంలోని ఇళ్లలోకి వెళ్తోంది. కూటమి ప్రభుత్వం కరుణించి అతి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వాన నీటి నిల్వ సమస్యను పరిష్కరించాల్సిన అవశ్యకత ఎంతో ఉంది.


జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం దుస్థితి


ఆర్టీసీ బస్టాండ్‌లో వర్షపు నీరు